క్లుప్తంగా

ఘనంగా పీఆర్టీయూ ఆవిర్భావ దినోత్సవం



వేడుకలకు హాజరైన పీఆర్టీయూ నాయకులు, ఉపాధ్యాయులు

శృంగవరపుకోట: స్థానిక మండల విద్యావనరుల కేంద్రంలో పీఆర్టీయూ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఇందుకూరి అశోక్‌రాజు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె.మోహన్‌రాజు ఆధ్వర్యంలో మండలశాఖ అధ్యక్షుడు జి.సూరిబాబు పీఆర్టీయూ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈసందర్భంగా జిల్లా కార్యదర్శి కె.బంగారునాయుడు మాట్లాడుతూ 1971లో సామల యాదగిరి ఆధ్వర్యంలో ఏర్పాటైన పీఆర్టీయూ నాటి నుంచి నేటి వరకు ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి, హక్కుల సాధనకు పోరాటం చేస్తూనే ఉందన్నారు. సంఘ నాయకుడు గాదె శ్రీనివాసులునాయుడును మళ్లీ ఎమ్మెల్సీగా ఎన్నుకోవాలని సభ్యులను కోరారు. పీఆర్టీయూ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి చుక్క మధుమోహన్‌రావు, మండల శాఖ గౌరవాధ్యక్షుడు డి.వి.సూర్యనారాయణ, ప్రధాన కార్యదర్శి టి.అప్పారావు, రహీంషేక్‌లాల్, ఆర్.రాంబాబు, ఎన్.సత్తిబాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సందడిగా వార్షికోత్సవం



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

బొండపల్లి: గొట్లాం గ్రామంలో గాయత్రీ విద్యాసంస్థల వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా విద్యార్థులు నృత్యాలు, ఆటపాటలతో సందడి చేశారు. అలాగే రేలారే రేలారే పల్సర్ బైక్ రమణ జానపద గీతాలతో అలరించారు. విద్యాసంస్థల కరస్పాండెంట్ జి.జగదీశ్వరి, ప్రిన్సిపాల్ జి.ఎరుకునాయుడు, ఏఓ జి.రాఘవ, అధ్యాపకులు పాల్గొన్నారు.

వివక్ష కనబరిస్తే సహించం..

● వైఎస్సార్‌సీపీ నాయకులు



పోలీసు అధికారులను ప్రశ్నిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

పూసపాటిరేగ: వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై వివక్ష కనబరిస్తే సహించేది లేదని ఆ పార్టీ నాయకులు స్పష్టం చేశారు. ఈ మేరకు పార్టీ మండల అధ్యక్షుడు పతివాడ అప్పలనాయుడు, తదితరులు ఆదివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సీఐ జి. రామకృష్ణ, ఎస్సై ఐ.దుర్గాప్రసాద్‌లను కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పలు కేసులలో పోలీసులు పక్షపాత వైఖరి చూపించి అధికార పార్టీ నాయకులు పట్ల మొగ్గు చూపారన్నారు. పేరాపురంనకు చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త కోరాడ మహేష్‌పై జనసేన నాయకుడు దాడి చేస్తే, ఇరువైపులా కేసులు నమోదు చేస్తామనడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. పతివాడ బర్రిపేట కేసులో కొబ్బరి మొక్కలు ధ్వంసం చేసిన కేసులో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు బర్రి నర్సయ్యమ్మ, పోలిరాజులపై కూడా ఇదే మాదిరిగా కేసు నమోదు చేశారన్నారు. కొన్నేళ్లుగా కుటుంబ తగాదాలు ఉండడంతో ఇరువర్గాలపై కేసు నమోదు చేశామని సీఐ చెప్పడంతో వైఎస్సార్‌సీపీ ఖండించారు. ఎరుకొండలో జరిగిన వివాదంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్త పట్ల పోలీసులు వివక్ష కనబరిచారని సీఐ దృష్టికి తీసుకువచ్చారు. వాస్తవాలు పరిశీలించి తప్పు చేసిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలే తప్ప.. ఏకపక్షంగా కేసులు నమోదు చేయవద్దని కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ అల్లాడ రమేష్, ప్రజాప్రతినిధులు మహంతి జనార్దనరావు, మహంతి శ్రీనివాసరావు, మొంగం నాగబాబు, దాడిశెట్టి త్రినాథరావు, రౌతు సాయికుమార్, ఎడ్ల రామకృష్ణ, గుజ్జు సురేష్‌రెడ్డి, గాబు సూరప్పన్నరెడ్డి, కొయ్య ఎల్లన్నరెడ్డి, బొంపల సీతారాం, వాసుపల్లి అప్పన్న, కొత్తకోట శ్రీరాములు, శాంతాటి శ్రీనివాసరావు, తదితరులు ఉన్నారు.

విచ్చలవిడిగా మద్యం విక్రయాలు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని బొప్పడాం జంక్షన్‌లో గడిచిన రెండు రోజుల నుంచి బెల్ట్ దుకాణాల ద్వారా విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు సాగుతున్నాయి. పక్కనే కమ్మసిగడాంలోని మహాలక్ష్మి అమ్మవారి జాతర జరుగుతున్న సందర్భంగా బెల్ట్ దుకాణాలు విచ్చలవిడిగా వెలిశాయని స్థానికులు చెబుతున్నారు. బొప్పడాం ఉన్నత పాఠశాల సమీపంలోని రెండు దుకాణాల్లో.. బుచ్చన్నపేట జంక్షన్ సమీపంలోని మరో రెండు దుకాణాల్లో పగలురాత్రీ అనే తేడా లేకుండా విక్రయాలు జరుగుతున్నాని పలువురు ఆరోపిస్తున్నారు. సతివాడ మద్యం షాపు నుంచి మద్యం సీసాలు తీసుకువచ్చి, ఒక్కో సీసాపై రూ. 50 అదనంగా వసూలు చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి బెల్ట్ దుకాణాలను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.



కట్టె జనుముతో భూసారం / ఆదాయం బాగు

- విస్తరిస్తున్న కట్టెజనుము సాగు
- రబీలో విత్తనోత్పత్తి చేసి వాటిని విక్రయిస్తూ ఆదాయం ఆర్జిస్తున్న రైతులు
- ఖరీఫ్‌లో భూసారం పెంచేందుకు పచ్చిరొట్ట ఎరువుగా వినియోగం

వేపాడ: కట్టె జనుము పంట రైతులకు అన్ని విధాలా లాభసాటిగా మారుతోంది. ఒకప్పుడు ఈ పంటను పచ్చిరొట్ట ఎరువు కోసమే సాగు చేసేవారు. కానీ ప్రస్తుతం వాణిజ్య పంటగా మారడంతో ఎస్.కోట నియోజకవర్గంలో సాగు విస్తీర్ణం క్రమంగా పెరుగుతోంది. కట్టె జనుమును సాగు చేసి కలియదున్నడం వల్ల భూసారం పెరుగుతుందని, ఫలితంగా ప్రధాన పంటలకు పోషకాలు బాగా అందుతాయన్నది అందరికీ తెలిసిన విషయమే. అయితే కేవలం పచ్చిరొట్ట ఎరువు కోసమే ఈపంటను సాగుచేయడం ఎందుకని చాలామంది రైతులు రబీలో అపరాల పంటలను సాగు చేస్తున్నారు. కానీ కట్టెజనుముతో కలిగే ప్రయోజనాలు, వచ్చే ఆదాయం గురించి తెలిసిన కొందరు రైతులు మాత్రం అపరాల సాగుకు ప్రత్యామ్నాయంగా కట్టె జనుమును ఎంపిక చేసుకుంటున్నారు. అపరాల సాగు పెట్టుబడితో కూడిన పని, వాతావరణ పరిస్థితులు కూడా అను కూలించాలి. పంటను ఏమైనా చీడపీడలు ఆశిస్తే సరైన దిగుబడు లు రాక రైతులు నష్టపోవాల్సి ఉంటుంది. కట్టె జనుము సాగులో ఆ ఇబ్బందులు ఉండవు. ఈపంటసాగుకు దుక్కులు, విత్తనాల ఖర్చు తప్ప కలుపు తీత, ఎరువులు, పురుగుమందుల ఖర్చు లు ఏమీ ఉండవు. పైగా పంటకు తెగుళ్లు సోకే అవకాశమే ఉండదు. కట్టెజనుము చేను ఓవైపు పచ్చి రొట్ట ఎరువుగా భూసారానికి వినియోగపడుతుండడంతో పాటు మరోవైపు వాటి గింజలు విత్తనోత్పత్తికి, ఆయుర్వేద వైద్యంలో ఉపయోగపడుతున్నాయి. ఫలితంగా ఈ పంటసాగుపై రైతులు



వేపాడలో సాగులో ఉన్న కట్టె జనుము

మక్కువ చూపిస్తున్నారు. ప్రస్తుతం ఎస్. కోట నియోజకవర్గంలోని వేపాడ మండలంలో 155 ఎకరాల్లో, ఎల్.కోట, కొత్తవలస, ఎస్.కోట మండలాల్లో 84 ఎకరాల్లో బోరుబావులు ఆధా రంగా కట్టెజనుమును సాగుచేస్తున్నారు.ప్రస్తుతం పంట పూత, కాయలు కాత దశకు రావడంతో పసుపు పచ్చని పూలతో పొలాలు ఆకర్షణీయంగా కనిపిస్తున్నాయి.

భూమికి సారం... రైతుకు సిరులు

ఎలాంటి పెట్టుబడి ఖర్చులు లేని కట్టె జనుము సాగుతో రైతులకు రెండు విధాలుగా లాభాలున్నాయని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. ఇది పూర్తిగా ప్రకృతి వ్యవసాయ విధానంలో సాగయ్యే పంట అని, భూసారం పెంచడానికి, ఆదాయ ఆర్జనకు ఉపయోగపడుతుందని అంటున్నారు. రసాయన ఎరువులు, పురుగు మందులను వినియోగిస్తూ పంటలను సాగు చేయడం వల్ల భూమిలో సేంద్రియ కర్బనం తగ్గి, చౌడుశాతం పెరిగి క్రమంగా నేలలు నిస్సారమై సాగుకు పనికి రాకుండా పోతాయి. ఎంతపెట్టుబడి పెట్టినా దిగుబడి రాకరైతులు నష్టపోతుంటారు. ఇలాంటి పరిస్థితుల్లో పచ్చిరొట్ట పంటల్లో ఒకటైన కట్టెజనుమును సాగు చేసి నేలలో కలియదున్నడం వల్ల భూమికి నత్రజని, భాస్వరం, పొటాష్ వంటి పోషకాలు అందుతాయి, ఫలితంగా భూసారం పెరుగుతుంది. కట్టె జనుము గింజలను విత్తనాలుగా విక్రయించుకోవచ్చు. అలాగే ఈ గింజలను ఆయుర్వేద వైద్యంలో మోకాళ్ల నొప్పుల నివారణకు వినియోగించే హెంప్ ఆయిల్ తయారీకి ఉపయోగిస్తున్నారు. ఎకరానికి సుమారు అయిదు క్వింటాళ్ల గింజలు దిగుబడి వచ్చే అవకాశం ఉంటుందని, మార్కెట్‌లో వీటి ధర కిలో రూ.60 నుంచి రూ.70 వరకు ఉందని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. ఎకరానికి రూ.25 వేల నుంచి రూ.30 వేల వరకు ఆదాయం వస్తోందని పలువురు రైతులు చెబుతున్నారు.

సాగు విస్తీర్ణం పెరిగింది

జిల్లాలో వేపాడ మండలాన్ని ప్రకృతి వ్యవసాయానికి మోడల్‌గా ఎంపికచేశాం.కట్టె జనుము సాగు విస్తీర్ణం బాగా పెరిగింది. ఈ పంట పూర్తిగా ప్రకృతి వ్యవసాయ విధానంలో సాగుతుంది. రబీలో సాగు చేస్తున్న జనుము నుంచి విత్తనోత్పత్తి చేసి వాటిని రైతులు మార్కెట్‌లో విక్రయిస్తుంటారు. ఖరీఫ్‌లో సాగు చేసే జనుము పంటను భూసారం కోసం నేలలో కలియదున్నుతుంటారు.

– ఎం.ఆనందరావు, ప్రకృతి వ్యవసాయ విజయనగరం జిల్లా ప్రాజెక్టు అధికారి

ప్రజ్ఞావికాస్ పరీక్షకు విశేష స్పందన



పరీక్ష పత్రాలను ఆవిష్కరిస్తున్న యూటీఎఫ్ నాయకుడు వెంకటరావు, ఎస్ఎఫ్ఐ నాయకులు

శృంగవరపుకోట: భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) ఎస్.కోట మండల కమిటీ నేతృత్వంలో స్థానిక చైతన్య డిగ్రీ కళాశాలలో పదోతరగతి విద్యార్థులకు ఆదివారం నిర్వహించిన ప్రజ్ఞావికాస్ పరీక్షకు విశేష స్పందన లభించిందని ఎస్ఎఫ్ఐ నాయకులు తెలిపారు. పరీక్షకు వివిధ పాఠశాలలకు చెందిన 290 మంది విద్యా ర్థిని, విద్యార్థులు హాజరయ్యారు. యూటీఎఫ్ జిల్లా కార్యవర్గ సభ్యుడు జి.వెంకటరావు ముఖ్యఅతిథిగా హాజరై ప్రశ్నాపత్రాలను ఆవిష్కరించారు. ఈసంద ర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యారంగ సమస్యలపై ఎస్ఎఫ్ఐ సుదీర్ఘ పోరాటం చేయడమే కాకుండా, విద్యార్థులను ప్రోత్స హించేలా పోటీ పరీక్షలు నిర్వహిస్తూ, బహు మతులు ఇచ్చి వారిలో ప్రేరణ కలిగించడం అభినందనీయమన్నారు. పబ్లిక్ పరీక్షలకు సమయం దగ్గరపడుతు న్నందున విద్యార్థులంతా సమయం వృథా చేయ కుండా శ్రద్ధగా చదువుకుంటూ సన్నద్ధం కావాలని సూచించారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు ఏ.అనూష, మండల బాలికల కమిటీ కన్వీ నర్ రత్న, జిల్లా ఉపాధ్యక్షుడు కె.రమేష్, మండల కమిటీ సభ్యులు వి.చరణ్, రవి,శీల, అనిల్, తదితరులు పాల్గొన్నారు.

గురుకులంలో ప్రవేశాలకు దరఖాస్తులాహ్వానం

కొత్తవలస/ వేపాడ: కొత్తవలస మండలంలోని వియ్యంపేట, వేపాడ మండలంలోని బక్కునాయుడుపేట సమీపంలోని ఏపీ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల విద్యాలయాల్లో 2025–2026 విద్యా సంవత్సరంలో 5వ తరగతి, ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాళ్లు టి.జయశ్రీ, ఉషారాణి ఆదివారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు.

5వ తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకునే విద్యార్థినులు ఎస్సీ, ఎస్టీ సామాజిక వర్గానికి చెందిన వారైతే 2012 సెప్టెంబర్ 1వ తేదీ నుంచి 2016 ఆగస్టు 31 మధ్య జన్మించి ఉండాలని, బీసీ, ఓసీ విద్యార్థినులు 2014 సెప్టెంబర్ 1 నుంచి 2016 ఆగస్టు 31వ తేదీ మధ్య జన్మించిన వారు అర్హులని పేర్కొన్నారు. ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్స రంలో ప్రవేశాలకు 2024–25వ సంవత్సరంలో 10వ తరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థినులే దరఖాస్తు చేసుకోవాలని స్పష్టం చేశారు. మార్చి 6వ తేదీలోగా https://apbragcet.apcfss.in/ వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోలేక పోయిన వారు విద్యార్థిని ఆధార్ కార్డు,తల్లిదండ్రుల ఫోన్ నంబర్ తీసుకుని పాఠశాలలకు వస్తే సిబ్బందే ఉచితంగా ఆన్‌లైన్ చేస్తారని పేర్కొన్నారు.

హోరా హోరీగా...



కబడ్డీ పోటీల్లో తలపడుతున్న గవరపాలెం-వేపాడ జట్లు



పోటీలో పరుగుతీస్తున్న ఎడ్లు

వేపాడ: ఆకులసీతంపేట గ్రామంలో వివేకానంద సాదుబాబు తీర్థం సందర్భంగా ఆదివారం సాయంత్రం నిర్వహించిన ఎడ్ల పరుగు పోటీలు, రాత్రి ఫ్లడ్ లైట్ల వెలుగులో నిర్వహించిన కబడ్డీ పోటీలు హోరాహోరీగా సాగాయి. ఎడ్ల పరుగు పోటీల్లో అనకాపల్లి, విజయనగరం జిల్లాలకు చెందిన 13జతల ఎడ్లు పాల్గొనగా..వల్లంపూడి గ్రామానికి చెందిన ఏడు వాక సత్తిబాబు ఎడ్లు ప్రథమస్థానంలో నిలిచి రూ.20 వేల నగదు బహుమతి గెలుచుకున్నాయి. వరుసగా మొదటి నాలుగు స్థానాల్లో నిలిచిన ఎడ్లకు సంబంధించిన యజమానులకు నగదు బహుమతులు అందజేశారు. కబడ్డీ పోటీల్లో విశాఖ,అనకాపల్లి, విజయనగరం జిల్లాలకు చెందిన 30 జట్లు తలపడుతున్నాయి. డీసీసీబీ మాజీ చైర్మన్ వేచలపు చినరామునాయుడు, వైస్ ఎంపీపీ అడపా ఈశ్వరరావు, ఎంపీటీసీ టి.వి.రమణ, గ్రామపెద్దలు కేదారి బంగారయ్య, కేదారి దొరబాబు పాల్గొన్నారు.

ప్రణాళికతో చదివితే ఉత్తమ ఫలితాలు

గజపతినగరం: పదోతరగతి పబ్లిక్ పరీక్షలకు సమయం దగ్గరపడుతోందని, సమయాన్ని వృథా చేయకుండా ప్రణాళికబద్ధంగా సన్నద్ధమైతే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని జిల్లా సహాయ వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి యశోదనరావు విద్యార్థులకు సూచించారు. స్థానిక బీసీ బాలుర వసతి గృహంలో గజపతినగరం, ఎస్.కోట ధర్మవరం,బోనంగి, గంట్యాడ బాలుర హాస్టళ్లు, కొత్తవలస, దేవుపల్లి చీపురుపల్లి, జొన్నవలస, కలవచర్ల బాలికల వసతి గృహాలకు సంబంధించిన పదోతరగతి విద్యార్థులకు ఆదివారం ప్రేరణ తరగతులు, అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి పెంటోజీరావు మాట్లాడుతూ పాఠ్యాంశాల్లో ఏమైనా సందేహాలు ఉంటే పాఠశాలలో సంబంధిత సబ్జెక్టు ఉపాధ్యాయుడితో నివృత్తి చేయించుకోవాలని సూచిం చారు. శతశాతం ఉత్తీర్ణత పాటు విద్యార్థులంతా మంచి మార్కులు సాధించాలని ఆకాంక్షించారు.ప్రావీణ్యత కలిగిన గణిత ఉపాధ్యాయుడు సుధాకర్, ఇంగ్లిష్ టీచర్ వై.సుగుణ, బయాలజీ టీచర్ శ్రీరామమూర్తి, సాంఘిక శాస్త్రం ఉపాధ్యాయుడుఎం.మురళీ ఆయా సబ్జెక్టులకు సంబంధించి పరీక్షల్లో తరచూ వచ్చే ప్రశ్నలు వాటికి సమాధానాలు రాయడం, సులభంగా ఎక్కువ మార్కులు సాధించే విధానాలపై అవగాహన కల్పించారు. అనంతరం పరీక్షలకు అవసరమైన సామగ్రిని విద్యార్థులకు అందజేశారు. జిల్లా హెచ్‌డ బ్ల్యూఎస్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు బి.మోహన్‌రావు, గజపతినగరం, ధర్మవరం, ఎస్.కోట, బోనంగి, గంట్యాడ, కొత్తవలస, దేవుపల్లి, చీపురుపల్లి, జొన్నవలస, కల్వచర్ల బీసీ బాలుర వసతి గృహ సంక్షేమాధికారులు బి.శ్రీధర్, ఎస్.సత్యనారాయణ, ఎన్.గౌతమి, బి.చంద్రునాయుడు, టి.ఎస్.ఆర్.శర్మ, జి.పద్మ, ఎం.పద్మిని,డి.అనూరాధ, ఎస్.సంగీత, పి.కన్నంనాయుడు పాల్గొన్నారు.



విద్యార్థినులకు పరీక్ష సామగ్రి పంపిణీ చేస్తున్న జిల్లా వసతి గృహ సంక్షేమ అధికారులు

విచక్షణ ఉండాలి



ధర్మమేదో, అధర్మమేదో గ్రహించే విచక్షణతో పాటు ధర్మాన్ని పాటించే వ్యక్తిత్వం ప్రతి ఒక్కరిలోనూ ఉండాలని త్రైత సిద్ధాంత ప్రబోధసేవా సమితి, ఇందూ జ్ఞానవేదిక కమిటీ ప్రతినిధులు అన్నారు. గరివిడి మండలంలోని అప్పన్నవలస గ్రామంలో త్రైతసిద్ధాంత భగవద్గీత, అనుబంధ గ్రంథాలపై ఆదివారం ఇంటింట ప్రచారం చేశారు. ఈసంద ర్భంగా వారు మాట్లాడుతూ ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలని చెప్పారు. హిందూ సంప్రదాయాలను, దేవాలయాల్లోని రహస్యాలను, హిందూ పండగల విశిష్టతను వివ రించారు.త్రైత సిద్ధాంత భగవద్గీతను చదవడం ద్వారా జ్ఞానం సిద్ధిస్తుందన్నారు. ఆత్మ, పరమాత్మ, కర్మయోగం విశిష్టత గురించి తెలుసుకోవచ్చని చెప్పారు. ప్రబోధసేవా సమితి, ఇందూ జ్ఞానవేదిక కమిటీ ప్రతినిధులు ఎం.రామినాయుడు, రామకృష్ణ, సూరపునాయుడు, మల్లమ్మ, లక్ష్మి, అన్నపూర్ణ, తదితరులు పాల్గొన్నారు. – చీపురుపల్లిరూరల్(గరివిడి)

హిందీ ప్రాథమిక పరీక్ష



వేపాడలోని విక్టరీ హైస్కూల్‌లో దక్షిణ భారత హిందీ ప్రచార సభ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఆదివారం హిందీ పరిచయ, ప్రాథమిక పరీక్ష నిర్వహించారు. పాఠశాల అడ్మిన్ రాఘవ మాట్లాడుతూ విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచే జాతీయ భాష హిందీపై పట్టు సాధించాలన్నారు. హిందీ రాయడం, చదవడం, మాట్లాడడం నేర్చుకోవాలని సూచించారు. హిందీ వస్తే దేశంలో ఎక్కడికి వెళ్లినా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఉంటాయని అన్నారు. – వేపాడ

రక్తదానం



ఆర్.రామచంద్రాపురం గ్రామంలో అమ్మసేవ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. విజయనగరం ఎస్‌వీఎస్ బ్లడ్ బ్యాంక్ సిబ్బంది శిబిరంలో 40మంది యువకుల నుంచి రక్తం సేకరించారని అమ్మసేవ ఫౌండేషన్ అధ్యక్షుడు సురేష్ తెలిపారు. రక్తదాతలను సురేష్‌తో పాటు సహాయ స్ఫూర్తి ఫౌండేషన్ అధ్యక్షుడు వై.వి.సాయికుమార్, బొబ్బిలికి చెందిన అభ్యుదయ ఫౌండేషన్ అధ్యక్షురాలు చింత శారద అభినందించారు. గ్రామపెద్దలతో కలిసి దాతలకు సర్టిఫికెట్లు అందజేశారు. – దత్తిరాజేరు

అత్యాధునిక చికిత్సతో క్యాన్సర్‌కు చెక్



అవగాహన కల్పిస్తున్న ఆంకాలజిస్ట్ డాక్టర్ ఉమాశంకర్



హాజరైన పీఎంపీలు, ఆర్ఎంపీలు

గజపతినగరం: క్యాన్సర్ బారినపడిన వారు ఎలాంటి భయాందోళన చెందాల్సిన పనిలేదని, అన్నిరకాల క్యాన్సర్లను అత్యాధునిక చికిత్సల ద్వారా నివారించవచ్చని ప్రముఖ రేడియేషన్, సర్జికల్ ఆంకాలజిస్టులు మృత్యుంజయరావు,టి.ఉమాశంకర్ అన్నారు. స్థానిక లక్ష్మీ శ్రీనివాస కల్యాణ మండపంలో మహాత్మాగాంధీ క్యాన్సర్ హాస్పిటల్, రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్, మహేంద్ర హాస్పిటల్ సంయుక్తంగా పీఎంపీలు, ఆర్ఎంపీలకు క్యాన్సర్‌పై ఆదివారం అవ గా హన కల్పించారు.సర్జికల్ ఆంకాలజీ, గైనిక్ ఆంకాలజీ, రోబోటిక్ సర్జరీ, రేడియేషన్ ఆంకాలజీ, క్యాన్సర్ స్క్రీనింగ్ సేవలను వివరించారు. లాపరోస్కోపీ మల్టీస్పెషాలిటీ సేవలపై డాక్టర్ మహేంద్రగిరి అవగాహన కల్పించారు. గజపతినగరం ఆర్ఎంపీ, పీఎంపీల అసోసియే షన్ అధ్యక్షుడు ఎల్.ఎస్. నాయుడు, మహేంద్ర ఆస్పత్రి ఏఓ పైడినాయుడు, మహాత్మా గాంధీ ఆస్పత్రి పీఆర్ఓ పి.వీరబాబు, జి.సుమన్ పాల్గొన్నారు.

నేడు ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ



కొత్తవలస: వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వియ్యంపేట పీహెచ్‌సీ వైద్యసిబ్బంది

కొత్తవలస: జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం(డీ వార్మింగ్ డే) సందర్భంగా సోమవారం ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేయనున్నామని, ఈకార్యక్రమాన్ని ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలు, వైద్యసిబ్బంది విజయవంతం చేయాలని వియ్యంపేట పీహెచ్‌సీ వైద్యాధికారి గోపాలకృష్ణ కోరారు. సంబంధిత వాల్‌పోస్టర్లను పీహెచ్‌సీ ఆవరణలో ఆదివారం ఆవిష్కరించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లోని 1 నుంచి 19 సంవత్సరాల లోపు వారందరితో మధ్యాహ్న భోజనం చేసిన తర్వాత నులిపురుగు నివారణ మాత్రలు మింగించాలని సూచించారు. మండల వ్యాప్తంగా 4,250 మంది పిల్లలకు మాత్రలు పంపిణీ చేయనున్నామని చెప్పారు. పీహెచ్‌సీ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

చీపురుపల్లి మండలంలో...

చీపురుపల్లి: మండలంలో ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ ఐ.సురేష్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని అన్ని పాఠశాలలు,కళాశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో 19 సంవత్సరాల లోపు విద్యార్థులతో మధ్యాహ్నం భోజనం చేసిన అరగంట తర్వాత మాత్రలు మింగించాలని వైద్య సిబ్బందికి సూచించారు. మాత్రలు వేసుకున్న తర్వాత విద్యార్థుల్లో ఎలాంటి రియాక్షన్లు వచ్చినా వారిని సమీపంలోని పీహెచ్‌సీ, సీహెచ్‌సీలకు తీసుకెళ్లేందుకు 104, 108 వాహనాలు సిద్ధంగా ఉంచినట్లు పేర్కొన్నారు.

మండల సర్వసభ్య సమావేశం రేపు

దత్తిరాజేరు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఉదయం మండల సర్వ సభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున నిబంధన ప్రకారం సమావేశం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. మండల పరిషత్ సభ్యులు, సర్పంచ్‌లు, మండల అధికారులు హాజరు కావాలని కోరారు.